ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -55 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 14 జూన్ 2026

## భారత్ అరుదైన ఘనత..

### ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

- ఐసీబీఎం ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం
- వరుసగా మూడు దీవీణ ఫ్లైట్ టెస్టులు సక్సెస్
- ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల జాబితాలో భారత్
- నేవల్ యాంటీ-షిప్ మిస్సైల్ తొలి పరీక్ష విజయవంతం

**ఢిల్లీజూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. **మిగతా 2లో...**





## కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- పలు కీలక కమాండ్లకు నాయకత్వం
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

**ఢిల్లీజూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. **మిగతా 2లో...**

## ఒప్పందానికి చేరువగా

- ఇరాన్, అమెరికా సంకేతాలు
- ఆందోళనలో ఇజ్రాయిల్
- లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయిల్ బాంబు దాడులు
- వచ్చే నెలలో ఖమేనిఅంత్యక్రియలు




# పెట్టుబడులపై ఫోకస్..!

### నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

- సింగపూర్ పర్యటనలో కీలక భేటీలు
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సమావేశం
- అమరావతి నిర్మాణంపై సుర్బానా జురాంగ్ సంస్థతో చర్చలు
- 2026 సీఐఐ భాగస్వామ్య సదస్సు రోడ్‌షోలో పాల్గొననున్న ముఖ్యమంత్రి

**అమరావతి జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్‌లో పర్యటించనున్నారు. జూన్ 14 నుంచి సాగే ఈ పర్యటనలో రాష్ట్రానికి, ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు సమీకరించడంపై ఆయన ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇందుకోసం నేడు ఉదయం బెంగళూరు నుంచి **మిగతా 2లో...**



## స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన





## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

### హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం: మంత్రి సత్యకుమార్

- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్
- ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య
- ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి

**అమరావతి జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు. **మిగతా 2లో...**

## చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

- ఉపాధి హామీ నిధులను పూర్తి వినియోగం
- సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
జలధార-జలహారతి పనుల్లో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. జలధార పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం
- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు



## హైఅలర్ట్‌గా ఉండండి

### సమస్యాత్మక ప్రాంతాలకు టీమ్‌లను ముందుగా పంపండి

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం ఆదేశాలు

**హైదరాబాద్ జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో హై అలర్ట్‌గా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, క్యూర్ స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరి తో యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి చర్యలు చేపట్టాలన్నారు. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. **మిగతా 2లో...**



## రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత



# కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు.సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

**మొదటిపేజీ తరువాయి**

గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# భారత్ అరుదైన ఘనత..

**మొదటిపేజీ తరువాయి**

వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది.

డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు.

ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది.

మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

# హైఅలర్ట్‌గా ఉండండి

**మొదటిపేజీ తరువాయి**

రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో టీములను ముందస్తుగా మోహరించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. శంషాబాద్ వద్ద బెంగళూరు హైవేపై భారీగా వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత సిబ్బంది.. మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తున్నారు. షాద్‌నగర్‌లోనూ జాతీయ రహదారిపై భారీగా వరద నిలిచింది.

# నా మీద కోపం నేతన్నల మీద చూపొద్దు

**హైదరాబాద్, జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

## నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స

**జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు.విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు.ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు.

# చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత

**మొదటిపేజీ తరువాయి**

ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార-జలహారతి పనుల పురోగతిపై ముఖ్యమంత్రి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా జలధార పనులు చేపట్టాలన్నారు. ఈ నిధుల వినియోగంలో అలసత్వాన్ని ప్రదర్శించవద్దన్నారు. నీటి మిగులు బేసిన్ల నుంచి తక్కువ నీటి లభ్యత ఉన్న బేసిన్లను అనుసంధానం చేసే పనులను చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జలధార పనుల కింద చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్‌లు, కాంటూర్ కందకాల పునరుద్ధరణ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. చిన్న వాగుల అభివృద్ధికి.. వాల్మీకిపురం వాగు అభివృద్ధి మోడల్ పరిశీలించాలని సూచించారు. నీటి భద్రత విషయంలో ప్రతీ జిల్లా ఒక వినూత్నమైన విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. జలధార మొదటి విడత పనులు పూర్తయిన తర్వాత చెక్ డ్యామ్‌లు, ఫామ్ పాండ్‌లు, చెరువులకు గండ్లు పడకూడదన్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కాలువలు, కరకట్టలలో అడ్డంకులు తొలగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. జలధార వల్ల కలిగే లాభాలను ఇరిగేషన్, అవేర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. జిల్లాల వారీగా భూగర్భ జలాల పునరుద్ధరణ లెక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. జలధార కార్యక్రమంలో స్థానికులు, రైతులు, నీటి సంఘాలను భాగస్వాములు చేయాలని, దీనికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒప్పందానికి చేరువగా

**ఇరాన్, అమెరికా సంకేతాలు**

**ఆందోళనలో ఇజ్రాయిల్**

**లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయిల్ బాంబు దాడులు**

**వచ్చే నెలలో ఖమేనిఅంత్యక్రియలు**



**ఢిల్లీజూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**

శాంతి ఒప్పందానికి చేరువగా ఉన్నామని ఇరాన్, అమెరికా దేశాలు సంకేతాలు ఇచ్చాయి. అయితే కీలక అంశాలపై ఇంకా అవగాహన కుదరలేదని సమాచారం. రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరపుతున్న పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా రాబోయే 24 గంటలలో ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. ఓ వైపు ఇరాన్-అమెరికా మధ్య చర్చలు కొనసాగుతుండగానే మరోవైపు దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సేనలు బాంబు దాడులు కొనసాగించాయి. తాజా దాడులలో కనీసం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా తన వద్ద ఉన్న యురేనియం నిల్వలను భద్రపరచుకోవడానికి ఇరాన్ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం ముడి పదార్థాలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నించవచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో టెహ్రాన్ పలు చర్యలు చేపట్టింది. సొరంగాలను మూసేసింది. కీలకమైన అణు స్థావరాల చుట్టూ మందుపాతరలు అమర్చింది. ఇరాన్ యురేనియం నిల్వలలో అధిక భాగం ఇస్ఫహాన్ అణు సముదాయంలోని భూగర్భంలో ఉన్నదని, ఇతర చోట్ల కూడా స్వల్ప పరిమాణంలో నిల్వ ఉన్నదని తెలుస్తోంది.

**ఎవరేమన్నారు?**

మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో కుదుర్చుకుంటున్న అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) ఇంతకుముందు ఎన్నడూ లేనంత చేరువగా ఉన్నదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అది ఖరారయ్యే వరకూ ఊహాగానాలు చేయవద్దని మీడియాను కోరారు. అరాగ్చీ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో తిరిగి పోస్ట్ చేశారు. ఇరు పక్షాల అంగీకారంతో శాంతి ఒప్పందం ఖరారైందని, అయితే తదుపరి చర్యలు పెండింగులో ఉన్నాయని పాక్ ప్రధాని షరీఫ్ చెప్పారు. ఒప్పందంపై ఎలక్ట్రానిక్ సంతకాలు జరుగుతాయని, వచ్చే వారం సాంకేతిక స్థాయి చర్చలు ప్రారంభమవుతాయని తెలిపారు. చర్చల సందర్భంగా ఇరాన్, అమెరికాలు చూపిన నిబద్ధతను ప్రశంసించారు. చర్చలకు మద్దతు తెలిపిన మధ్యప్రాచ్య దేశాలకు కృతజ్ఞతలు తెలియ జేశారు. 'ఈ చారిత్రక ఒప్పందం చిరకాల శాంతికి బలమైన పునాది వేస్తుందని మాకు నమ్మకం ఉంది' అని అన్నారు. కాగా అమెరికా-ఇరాన్ చర్చలలో పురోగతిపై పాకిస్తాన్, ఈజిప్ట్ హర్షం వ్యక్తం చేశాయి. శాంతి ఒప్పందంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు సమసిపోతాయని తెలిపాయి.

**ఒప్పందంపై ఇజ్రాయిల్ ఆందోళన**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం ఇజ్రాయిల్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. ఎందుకంటే దేశ ప్రజల ముందు ఇజ్రాయిల్ ఉంచిన వ్యూహాత్మక లక్ష్యాలు వేరేగా ఉన్నాయి. యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఇజ్రాయిల్‌కు లేదు. ఇరాన్-అమెరికా మధ్య కుదిరే ఒప్పందం కంటే లెబనాన్‌పై పట్టు సాధించడానికే ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రాధాన్యత ఇస్తున్నారు.

**వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు**

అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ మాజీ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జూలైలో మొదలవు తాయని ప్రభుత్వ మీడియా తెలిపింది. జూలై 4, 5 తేదీలలో టెహ్రాన్‌లో వీడ్కోలు కార్యక్రమం జరుగుతుందని, ఆ మరునాడు టెహ్రాన్‌లో, జూలై 7న ఖ్వోమ్‌లో అంత్యక్రియలు జరుగుతాయని వివరించింది. జూలై 9న మషహద్ నగరంలోని ఇమామ్ రెజా మసీదులో మరో అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించిన తర్వాత ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేస్తారు.

# పెట్టుబడులపై ఫోకస్..!

**మొదటిపేజీ తరువాయి**

ఆయన సింగపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనకు వెళ్లనున్నారు.

పర్యటనలో భాగంగా చంద్రబాబు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో పాటు ఆ దేశ ఉప ప్రధాని, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్, విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, హోం మంత్రి షణ్ముగమ్ వంటి కీలక నేతలతో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వ విధానాలను వారికి వివరించనున్నారు. తొలుత సింగపూర్‌లోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో భేటీ అయి పర్యటన అజెండాపై చర్చిస్తారు.పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు గూగుల్ క్లౌడ్, జీఐసీ, వైసీహెచ్ లాజిస్టిక్స్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు భేటీ కానున్నారు. స్టార్టప్ వెంచర్ క్యాపిటలిస్టులతో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ అధ్యక్షుడితోనూ సమావేశమై విద్యా రంగంలో భాగస్వామ్యంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం రాజధాని అమరావతి. రాజధాని మాస్టర్ ప్లాన్ రూపొందించిన సుర్బానా జురాంగ్ సంస్థ ప్రతినిధులతో అమరావతి ప్రణాళికపై ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పర్యటనలో భాగంగా 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం 2026లో విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సన్నాహకంగా ఏర్పాటు చేసిన బిజినెస్ రోడ్‌షోలో చంద్రబాబు పాల్గొంటారు. పర్యటన ముగించుకుని 16న రాత్రి 10 గంటలకు ఆయన తిరిగి స్వదేశానికి రానున్నారు. ముఖ్యమంత్రి వెంట పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటుంది.

# స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై సర్వత్రా ఆందోళన

**15న తెరుచుకోనున్న పాఠశాలలు**

**వాహనాల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖ మార్గదర్శకాలు జారీ**




**హైదరాబాద్, జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**

ఈ నెల 15 నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. కొత్త విద్యాసంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచే ప్రారంభం కావాల్సిన స్కూళ్లు ఎండల కారణంతో 15 నుంచి తెరచుకోనున్నాయి. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులు తిప్పితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని వాపోతున్నారు. దీంతో విద్యాసంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ పేరొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఫిట్‌నెస్ లేని, విద్యార్థులను లెక్కకుమించి ఎక్కించుకుని నడుపుతున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెహికల్స్‌కు పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ తప్పనిసరి అని తెలిపారు. డ్రైవర్లు లైసెన్స్ లేకుండా, ఓవర్ లోడ్‌తో వాహనాలు నడిపితే వెంటనే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 25,987 విద్యా సంస్థల బస్సులు ఉండగా 22,158 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయని, మిగిలిన 3,829 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని చంద్రశేఖర్ గౌడ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యాలు ఫీజులపై ఉన్న శ్రద్ధ, బస్సుల ఫిట్‌నెస్‌పై కూడా ఉండాలని పేర్కొంటున్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రమాదానికి దారి తీసే అవకాశముందని వాపోతున్నారు. స్కూల్ బస్సుకు పాఠశాల పేరు, ఫోన్ నెంబర్, చిరునామా, బస్సు ఎడమ వైపు పూర్తిగా కనిపించేలా ఉండాలి. వాహనాలు తప్పనిసరిగా పూర్తి కండీషన్‌లో ఉండాలని అధికారులు పేర్కొన్నారు. బస్సు, వ్యాన్‌కు రెండు వైపులా మిర్రర్స్ ఉండాలని, డ్రైవర్ వయస్సు 60ఏళ్లకు మించరాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, డ్రైవర్లు మూడు నెలలకోసారి షుగర్, బీపీ, గుండె పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే, ప్రతీ బస్సుకు ఒక అటెండర్ ఉండా లని, బస్సులో అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా వెల్లడిస్తున్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలి. పాఠశాల ఉన్న ప్రాంతంలో రహదారిపై స్కూల్ జోన్ సైన్ బోర్డులు, రహదారి పై ప్రత్యేక రంగులు వేయించాలి. విద్యార్థులున్నారనే సంకేతాన్ని వాహనాల డ్రైవర్లు దూరం నుంచే గుర్తించేలా పిల్లల ఛాయాచిత్రాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. తరగతుల ప్రారంభం, ముగింపు సమయాల్లో రహదారిపై గేటు వద్ద రద్దీ సమస్య లేకుండా చూడాలి. పిల్లలు, వారి తల్లిదండ్రులు రోడ్డు దాటేలా జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వ హిస్తాం అని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే స్కూల్ బస్సుల యాజమా న్యాలపై కఠినచర్యలు తీసుకుంటాం. ప్రైవేటు పాఠశాలల బస్సులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. భద్రతా ప్రమాణాలు పాటి స్తూ పాఠశాలల బస్సులు నడపాలి. అనుభవం ఉన్న డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి. తల్లిదండ్రులు కూడా బస్సుల స్థితిపై ఫీడ్‌బ్యాక్ తీసుకొని పాఠశాలల యాజమాన్యాలకు రీమార్కులు తెలియజేయాలి. ప్రమాదా లు జరుగకుండా పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు, తల్లిదండ్రు లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# మోదీ పాలన దేశ అభివృద్ధికి నిదర్శనం

## 12 ఏళ్లలో సంక్షేమం .. అభివృద్ధి సమన్వయం -వ్యాఖ్యానించిన బీజేపీ నేతలు




**అనంతపురం ప్రతినిధి, జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన దేశ అభివృద్ధికి నిదర్శనమని బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశం సుపరిపాలన దిశగా పయనిస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. గత 12 ఏళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనంతపురం రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో పత్రికా విలేఖరుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, ఢిల్లీ టీటీడీ చైర్మన్, 12 సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమ రాయలసీమ ఇన్‌చార్జి సుమంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

**రక్షణ రంగంలో దేశం శక్తివంతమైన స్థాయికి చేరుకుంది**

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ పాలనలో దేశంలోని సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, 58.15 కోట్ల జనధన్ ఖాతాల ద్వారా బ్యాంకింగ్ సేవలను సామాన్యులకు చేరువ చేశారని తెలిపారు. 44 కోట్ల మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు, 15.7 కోట్ల కుటుంబాలకు తాగునీటి కనెక్షన్లు, 12 కోట్ల మరుగుదొడ్లు, 10 కోట్ల ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందించారని వివరించారు. అలాగే 4 కోట్ల ఇళ్ల నిర్మాణం, 2.9 కోట్ల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు, 86 కోట్ల రేషన్ కార్డుదారులకు ఉచిత రేషన్ పంపిణీ, 9 కోట్ల మందికి పైగా అటల్ పెన్షన్ యోజన లబ్ధి, 58 కోట్ల మందికి పైగా బీమా పథకాల ప్రయోజనాలు కల్పించారని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, విదేశాంగ సంబంధాలు బలోపేతం అయ్యాయని, రక్షణ రంగంలో దేశం శక్తివంతమైన స్థాయికి చేరుకుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిళ్లు నెలకొన్నప్పటికీ భారతదేశంలో నిత్యావసర వస్తువుల ధరలను సామాన్యులకు భారం కాకుండా నియంత్రించగలిగిన ప్రభుత్వం మోదీ ప్రభుత్వమని వారు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, ఆంజనేయులు, సీనియర్ నాయకుడు రత్నమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్, మారుతి గోవింద్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లిక, నారాయణరెడ్డి, అరుణారెడ్డి, కవితాశర్మ, రావెల చైతన్య కిశోర్, కోశాధికారి అయ్యన్న, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు మల్లోబులు, దామోదర్, శివచరణ్, సౌభాగ్య, రంజిత్, చక్రధర్ యాదవ్, శాంత్‌కుమార్, భీమశేఖర్, దినేష్, రాందాస్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో భద్రతపై సీఐ పుల్లయ్య ఆకస్మిక తనిఖీ

### పోలీస్ అవుట్‌పోస్టు పనితీరుపై ఆరా
### అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచాలని ఆదేశం





**అనంతపురం క్రైమ్, జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో భద్రతా పరిస్థితులను సమీక్షించేందుకు టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య శనివారం ఆకస్మికంగా పోలీస్ అవుట్‌పోస్టును తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీలో అవుట్‌పోస్ట్ ఎస్సై సాకే త్రిలోకనాథ్‌తో కలిసి ఆసుపత్రి పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సీఐ స్పష్టం చేశారు. 24 గంటల పాటు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రతి కదలికపై నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో ఉన్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి పూర్తి భద్రత కల్పించడంతో పాటు ఆసుపత్రి ప్రాంగణంలో అనవసరంగా సంచరించే వ్యక్తులను గుర్తించి విచారించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని తెలిపారు.
అత్యవసర పరిస్థితులు, ఘర్షణలు లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న సందర్భంలో పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**ఆసుపత్రి భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు**

ఈ సందర్భంగా సీఐ పుల్లయ్య మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలు, వైద్య సిబ్బంది సురక్షిత వాతావరణంలో ఉండేలా చూడటం జిల్లా పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నేరాలకు, అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ఆసుపత్రి భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# రాయలసీమ అభివృద్ధికి కర్నూలును గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దాలి

**రాష్ట్రంలో నాలుగవ అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేయాలని డాక్టర్ తిరుపాల్ రెడ్డి డిమాండ్**

**విద్య, వైద్యం, ఐటీ, పారిశ్రామిక రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచన**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)**
కర్నూలు నగరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విశాఖపట్నం, అమరావతి, తిరుపతి తర్వాత నాలుగవ అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేయాలని డాక్టర్ తిరుపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నగర అభివృద్ధికి బహుళ దశల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. కర్నూలులో ఎయిమ్స్ తరహా వైద్య విద్యా సంస్థలు, కేంద్ర విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఐటీ మరియు పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేయడం ద్వారా యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు.
గ్రామీణాభివృద్ధి, మహిళల సాధికారత, కార్మిక సంక్షేమం, బీసీ సంక్షేమ పథకాల సమర్థ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రైల్వే కనెక్టివిటీ విస్తరణ, మైనారిటీల అభివృద్ధి, బ్యాంకింగ్ సేవల విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.
రాయలసీమ ప్రాంత సమగ్ర అభివృద్ధికి కర్నూలును కీలక అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని డాక్టర్ తిరుపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కర్నూలు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్నూలును నాలుగవ అతిపెద్ద నగరంగా అభివృద్ధి చేస్తే రాయలసీమ ప్రాంత ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## కర్నూలు డీఎస్పీగా కె.వి. రాఘవేంద్ర బాధ్యతల స్వీకారం

### ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడమే లక్ష్యం
### శాంతిభద్రతలు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)**
కర్నూలు సబ్‌డివిజన్ డీఎస్పీగా కె.వి. రాఘవేంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కర్నూలు డీఎస్పీగా విధులు నిర్వహించిన జె. బాబు ప్రసాద్ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది ఆంధ్రప్రదేశ్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో రాఘవేంద్ర ని నియమించారు.
నెల్లూరు జిల్లాకు చెందిన కె.వి. రాఘవేంద్ర నవంబర్ 1996లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో తన సేవలను ప్రారంభించారు. అనంతరం జూలై 2010లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. మే 1, 2026న డీఎస్పీ హోదాకు పదోన్నతి పొందిన ఆయన, ప్రకాశం మరియు గుంటూరు జిల్లాల్లో ఎస్సై, సీఐగా సుదీర్ఘకాలం సేవలందించి మంచి గుర్తింపు పొందారు.
డీఎస్పీ స్థాయి అధికారిగా తొలిసారిగా కర్నూలు జిల్లాలో బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని రాఘవేంద్ర తెలిపారు. కర్నూలు సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడంతో పాటు, పోలీసు శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర తెలిపారు.

# సాధనతోనే విజయాలు సాధ్యం

## ఒలింపిక్ డే రన్ ఉత్సవాల్లో కిక్ బాక్సింగ్ పోటీల ప్రారంభం

**జిల్లా స్థాయి పోటీల్లో వంద మందికి పైగా క్రీడాకారుల పాల్గొనం జూన్ 23న విజేతలకు బహుమతులు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)**క్రీడాకారులు నిత్య సాధనతోనే ఉన్నత విజయాలను సాధించగలరని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నాగరత్నమయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని త్రినాథ్ కిక్ బాక్సింగ్ అకాడమీలో ఒలింపిక్ డే రన్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలను వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, ఒలింపిక్ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 25 క్రీడాంశాల్లో విద్యార్థుల కోసం అంతర్ పాఠశాలల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జూన్ 23న నిర్వహించే ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో వంద మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ శెట్టి, కార్యనిర్వాహక కార్యదర్శి సునీల్ కుమార్, సంఘ సభ్యుడు డాక్టర్ రుద్ర రెడ్డి, రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి నరేంద్ర ఆచారి, కిక్ బాక్సింగ్ శిక్షకులు మరియు ఇతర క్రీడా ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేపడతాం

**కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్ కార్యవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు ద- అవినీతి, దోపిడీ, పౌర హక్కుల ఉల్లంఘనలపై ఉద్యమానికి సిద్ధం**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)ద**
కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్ సంస్థ ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేయాలని సంకల్పించింది. కర్నూలు నగరంలోని బుధవారపేటలో సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులపై జరుగుతున్న దోపిడీ, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల జాప్యం, అవినీతి, లంచగొండితనం, విద్యాసంస్థల్లో అక్రమ రుసుముల వసూళ్లు, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల నిర్వహణ, మహిళలపై అత్యాచారాలు, పౌర హక్కుల ఉల్లంఘనలు, కుల అసమానతలు, రైతు మరియు భూసమస్యలు, ఆలయాల్లో భక్తుల దోపిడీ వంటి అంశాలపై నిరంతరం పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సామాన్య ప్రజలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే తమ సంస్థ చట్టపరంగా అండగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో గ్రామాలు, పట్టణాల్లో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పౌర, మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు. అలాగే సంస్థను మరింత బలోపేతం చేసేందుకు త్వరలో విస్తృత స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సంస్థ అధ్యక్షుడు దండు విద్యాసాగర్, కార్యదర్శి వై. కిషోర్ కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎస్.ఎమ్.డి. ఇస్మాయిల్, ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గొందిపల్ల మాలతి, బండి మోహన్ బాబు, జిల్లా ఆధ్యాత్మిక ప్రత్యేక కార్యకర్త శ్రీకాంత్ శర్మ తదితరులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

# కాలువల్లో చెత్త వేస్తే నగరం జలమయం.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**వాగులో వ్యర్థాలు వేసిన ఫంక్షన్ హాల్‌కు రూ.10 వేల జరిమానా**

**వర్షపు నీటి పారుదల వ్యవస్థను కాపాడాలని ప్రజలకు కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి**





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)**
నగరంలో డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, గృహ వ్యర్థాలు వేయడం వల్ల వర్షపు నీటి పారుదల వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. కాలువలు చెత్తతో మూసుకుపోవడంతో వర్షపు నీరు సక్రమంగా ప్రవహించక రహదారులు జలమయమవుతున్నాయని, దీనివల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఉదయం కురిసిన వర్షం అనంతరం కమిషనర్ స్వయంగా సుమారు నాలుగున్నర గంటల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓల్డ్ కల్లూరు వక్కెర వాగు సమీపంలోని డైమండ్ ఫంక్షన్ హాల్ నిర్వాహకులు వ్యర్థాలను వాగులో వేస్తున్నట్లు గుర్తించిన కమిషనర్, ఆ సంస్థపై రూ.10 వేల జరిమానా విధించాలని ఆదేశించారు. అంతేకాకుండా ఆ ఫంక్షన్ హాల్‌ను బల్క్ వేస్ట్ జనరేటర్ జాబితాలో చేర్చి నిబంధనల ప్రకారం వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని సూచించారు.
అనంతరం ఆనంద్ టాకీస్ సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి రహదారులపై నీరు నిలిచిపోయిన పరిస్థితిని పరిశీలించారు. వ్యర్థాలను పూర్తిగా తొలగించే వరకు అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల దోమల ఉత్పత్తి పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. అలాగే దుర్వాసనలు, పారిశుద్ధ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భారీ వర్షాల సమయంలో నీరు ఇళ్లలోకి చేరి ఆస్తి నష్టాలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.
ప్రజలు తమ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను కాలువలు, వాగులు, ఖాళీ స్థలాల్లో వేయకుండా నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందజేయాలని సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజా ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# రాజనాల బండ టెంపుల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ ఆకస్మిక మృతి



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 13 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం స్వాధీనంలో ఉన్న రాజనాల బండ ఆలయ టెంపుల్ ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ (25) ఆకస్మికంగా మృతి చెందారు. తిరుపతిలోని ఆయన నివాసం వద్ద మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కాగా మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మహిళలు, బాలికల భద్రతే ప్రభుత్వ లక్ష్యం

**మహిళా సాధికారతకు సీఎం పెద్దపీట**

**మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

**ఆపరేషన్ దండయాన్‌తో నేరాల నియంత్రణ**

**బాధితులకు త్వరితగతిన న్యాయం అందిస్తాం**

**జిల్లా ఎస్పీ సతీష్ బాబు**




**శ్రీ సత్యసాయి/ఓడి చెరువు క్రైమ్,జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** మహిళలు, బాలికల భద్రతే ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలను అరికట్టడం, బాధితులకు త్వరిత న్యాయం అందించడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ చేపట్టిన "ఆపరేషన్ దండయాన్" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అమలవుతోందని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ బాబు తెలిపారు. శనివారం ఓడి చెరువు మండల కేంద్రంలో నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందుకు సాగుతోంది**

ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత అనేది ప్రతి కుటుంబం, సమాజం, ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మహిళల విద్య, వైద్యం, ఆర్థికాభివృద్ధి, సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, మహిళా సాధికారతకు అనుకూలమైన విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ బాబు మాట్లాడుతూమహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలపై అత్యాచారాలు, పోక్సో కేసులు, వేధింపుల ఘటనల్లో జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి కేసులో 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు విచారణను వేగవంతం చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, జియో ట్యాగింగ్, ఫేషియల్ రికగ్నిషన్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందన్నారు. బాధితులకు




న్యాయ సహాయం, కౌన్సెలింగ్ సేవలను కూడా అందిస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో నల్లమాడ సీఐ శ్రీనివాస్, ఓడి చెరువు ఎస్ఐ మల్లిఖార్జున రెడ్డి, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ మైనింగ్ ను తక్షణమే ఆపాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ డిమాండ్.**



**ఓర్వకల్లు జూన్ 13(రిపబ్లిక్ న్యూస్)**ఓర్వకల్లు వెల్దుర్తి మండలాల మధ్యల ఐరన్ ఓర్ అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా జరుగుతున్నదని దానిని వెంటనే నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి+. రామకృష్ణ డిమాండ్ చేశారు శనివారం రోజున రైతు సంఘం ప్రతినిధి బృందం +.రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ స్థానిక రైతు సంఘం నాయకులు భాషా మైనింగ్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను అక్రమార్కులు ప్రభుత్వం దగ్గర ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఇదేచ్ఛగా కోట్లాది రూపాయలు విలువచేసే ప్రజా సంపదను లూటీ చేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు రాత్రి వేళలో ఇటాచితో పని చేయించి అక్కడ ఉన్న ఐరన్ ఓర్ తరలించి పగలు పూట ఎవరికి తెలియకుండా ఇ టాచీని క్రిందికి తీసుకువచ్చి పెడుతున్నట్లు ఉన్నారు స్వయంగా పరిశీలించక దాంట్లో తేలిందని తెలిపారు ఇదే విషయాన్ని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైండ్స్ అండ్ జువాలజీ మరియు రాయల్ టీ ఇన్స్పెక్టర్ గార్లకు చరవాణి ద్వారా తెలియజేసినట్లు వారు తెలిపారు సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు వారు తెలియజేశారు ఇలాగే కొనసాగితే దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాముడు శివుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక ఉద్యమ నేతకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

**సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శిగా నాగేంద్ర కుమార్**



**అనంతపురం సంక్షేమం, జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న అనంతపురం జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి.విజయవాడలో జూన్ 9 నుంచి 12 వరకు నిర్వహించిన సీఐటీయూ రాష్ట్ర నిర్మాణ వర్క్‌షాప్‌లో నాగేంద్ర కుమార్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.


**అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లేదు**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్మిక ఉద్యమ నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాల పెంపు జరగకపోవడం, పనిభారం పెరగడం, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లేకపోవడం, పనిస్థలాల్లో భద్రతా ప్రమాణాల అమలు లోపించడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**మున్సిపల్ సేవలను ప్రైవేటీకరించే చర్యలు :** షెడ్యూల్డ్ ఉద్యోగ రంగాల్లో దాదాపు 18 సంవత్సరాలుగా కనీస వేతనాల సవరణ జరగకపోవడం ఆందోళన కరమన్నారు. చట్టప్రకారం ఐదేళ్లకోసారి జరగాల్సిన వేతన సవరణలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 975, 673ల ద్వారా మున్సిపల్ సేవలను ప్రైవేటీకరించే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ప్రజా సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల ఉద్యోగ భద్రత దెబ్బతినడంతో పాటు ప్రజలకు అందే సేవల నాణ్యత కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందన్నారు.జిల్లాలో కార్మికుల భద్రత, కనీస వేతనాల అమలు, సామాజిక భద్రతా పథకాల విస్తరణ, నిరుద్యోగ సమస్య పరిష్కారం, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం అనంతపురం జిల్లా కార్మిక ఉద్యమానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ఎస్. నాగేంద్ర కుమార్ పేర్కొన్నారు.

# బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై స్టాఫ్ నర్సులకు ప్రత్యేక శిక్షణ

**జీజీహెచ్‌లో అవగాహన కార్యక్రమం.. సంక్రమణ వ్యాధుల నివారణకు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచన**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)** ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులకు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, వాటి సక్రమ నిర్వహణ విధానాలపై వివరంగా అవగాహన కల్పించారు. పసుపు రంగు డబ్బాలో శరీర అవశేషాలు, రక్తంతో కలుషితమైన వ్యర్థాలు, ఎరుపు రంగు డబ్బాలో ప్లాస్టిక్ బయోమెడికల్ వ్యర్థాలు, తెలుపు రంగు డబ్బాలో సూదులు మరియు ఇతర పదునైన వస్తువులు, నీలం రంగు డబ్బాలో గాజు వ్యర్థాలను వేయాలని సూచించారు.అలాగే తెలుపు




రంగు షార్ప్స్ కంటైనర్‌లో ఒక శాతం హైపోక్లోరైట్ ద్రావణం తప్పనిసరిగా ఉండేలా చూడాలని తెలిపారు. బయోమెడికల్ వ్యర్థాల సక్రమ నిర్వహణ ద్వారా సంక్రమణ వ్యాధులను నివారించవచ్చని, వ్యక్తిగత భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు.విధులు నిర్వహించే సమయంలో ముఖం, ముక్కు, కళ్లను చేతులతో తాకకుండా జాగ్రత్తలు పాటించాలని, చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. ఆసుపత్రి పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు.ఇదివరకే శానిటేషన్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించగా, తాజాగా స్టాఫ్ నర్సులకు కూడా ప్రత్యేక శిక్షణ అందించడం విశేషం.ఈ కార్యక్రమంలో సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ వి. పద్మజ, అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ ఎం.వి. కిరణ్ కుమార్, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి గౌరి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్ టి. సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో నార్కోటిక్ స్టోరేజ్ భవన నిర్మాణ పనుల పరిశీలన..

## వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం

గంజాయి, మాదకద్రవ్యాల భద్రపరచేందుకు ప్రత్యేక నిల్వ కేంద్రం

నిర్మాణ పురోగతిని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)**కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నార్కోటిక్ స్టోరేజ్ బిల్డింగ్ పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పరిశీలించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పట్టుబడే గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలను భద్రపరచేందుకు ఈ ప్రత్యేక నిల్వ భవనాన్ని నిర్మిస్తున్నారు.భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ ప్రణాళిక ప్రకారం నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్‌కు సూచించారు. భవనం నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, తాత్కాలిక గోడౌన్ ఇన్‌చార్జి మరియు డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత వైపు సమిష్టి అడుగులు.

## . కర్నూలులో ఆపరేషన్ క్లీన్ స్వీప్ నాలుగో వారానికి చేరిక

**ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన నగర నిర్మాణం సాధ్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)** కర్నూలు నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నగరపాలక సంస్థ చేపడుతున్న 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం నాలుగో వారానికి చేరుకుంది. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ.సిరి నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఓల్డ్ కల్లూరు కురువ వీధిలో ప్రజా మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించిన కలెక్టర్, ముజఫర్ నగర్‌లో గార్బేజ్ పాయింట్‌ను నర్సరీగా అభివృద్ధి చేసిన ప్రాంతంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్వచ్ఛత అనేది కేవలం పారిశుద్ధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. తడి, పొడి, శానిటరీ, హానికర వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించడం ద్వారా స్వచ్ఛ నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

గత నాలుగు వారాలుగా నగరంలోని ప్రతి వార్డులో ప్రత్యేక థీమ్‌లతో నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాల ద్వారా పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, రహదారులు, జంక్షన్లు, డ్రైన్లు, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రతతో పాటు వ్యర్థాల వర్గీకరణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, శ్రీనివాసన్, ఏఈ ప్రవీణ్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, కుర్మయ్య, ఎంజల్ ప్రణీత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
ఆదివారం 14 జూన్ 2026

## జూన్ 15వ తేదీన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం.

..అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.

..అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు.

..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.



**కర్నూలు , జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):** ఈ నెల 15వ తేదీ సోమవారం ఉదయం 9–30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు , మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చుఅర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం.

-అధ్యక్షులు: సందీప్ కుమార్. -కార్యదర్శి: మేడా చంద్రశేఖర్. -కోశాధికారి: సురేష్.


అధ్యక్షులు సందీప్ కుమార్.


కార్యదర్శి మేడా చంద్రశేఖర్


కోశాధికారి సురేష్.

**నంద్యాల జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల లయన్స్ క్లబ్ 2026 –27 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నంద్యాల లయన్స్ క్లబ్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ.వి.ఆర్.ప్రసాద్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రవి కృష్ణ,సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, డాక్టర్ సహదేవుడు, ఆడిటర్ గోపాలకృష్ణమూర్తి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.అధ్యక్షులుగా ముదియనూర్ సందీప్ కుమార్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.ఉపాధ్యక్షులుగా పోసిన సుబ్బారావు,కూర ప్రసాద్,ఇమ్మడి వెంకట రామకృష్ణుడు ఎంపికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ సభ్యులు మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970 సంవత్సరంలో ప్రారంభించబడిందని, గత 56 సంవత్సరాలుగా నంద్యాల లయన్స్ క్లబ్ ప్రజలకు అనేక రకాల సేవా కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్నదని అన్నారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన సందీప్, చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రానున్న సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలు,దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు,పర్యావరణ,విద్య ,సాంస్కృతిక ,క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

## కేంద్ర వర్సిటీ కాన్వొకేషన్‌కు రాష్ట్రపతి రాక

### జూలై 1న జ్ఞానసీమలో తొలి స్నాతకోత్సవం



**అనంతపురం/శింగనమల సంక్షేమం, జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరుకానున్నారు. శింగనమల నియోజకవర్గ బుక్కరాయ సముద్రం మండల పరిధిలోని జంతులూరు గ్రామంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి, విశ్వవిద్యాలయ విజిటర్ హోదాలో పాల్గొననున్నట్లు విశ్వవిద్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.విశ్వవిద్యాలయం ఆవరణలోని 'జ్ఞానసీమ' ప్రాంగణంలో జూలై 1న నిర్వహించే ఈ స్నాతకోత్సవం చారిత్రాత్మకంగా నిలవనుంది. విశ్వవిద్యాలయం స్థాపన అనంతరం తొలిసారిగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా 2020 నుంచి 2026 విద్యా సంవత్సరాల మధ్య వివిధ కోర్సులు పూర్తి చేసిన 1,200 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు, పట్టాలను ప్రదానం చేయనున్నారు. విద్యా, పరిశోధన రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన 61 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయ నున్నట్లు అధికారులు వెల్లడించారు.రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పన, అతిథుల స్వాగత ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ స్నాతకోత్సవం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

### తమిళనాడు మరియు కర్ణాటక హైకోర్టు చీఫ్ జస్టిస్ చేతులమీదగా

## గౌరవ డాక్టరేట్ అందుకున్న సామ్రాజ్ గోవర్ధన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

2004వ సంవత్సరం నుండి ప్రస్తుతం వరకు సమాజ అసమాతలకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాలు చేయడం మూలంగా అలాగే కులరహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో పని చేసినందుకు అలాగే మతరహిత సమాజం కోసం అనేక రాష్ట్రాలలో పనిచేయడం వల్ల గ్లోబల్ పీస్ యూనివర్సిటీ, చెన్నై వారు నన్ను గుర్తించి నా సేవలను గుర్తించి ఈ అసమానతమైన సమాజంలో నూతన సమాజం ఏర్పడాలని సంకల్పంతో కృషి చేసిన నాకు ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేరళ, తమిళనాడు,కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, పంజాబ్,హర్యానా ముఖ్యమైన గౌరవ అతిథులు పాల్గొని నాకు ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, అలాగే కుల మత రహిత సమాజం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ...

# దేశంలో ప్రకృతి వ్యవస్థ చెట్లు అంతరించిపోతున్నాయి

### నీటిని వృధా చేయకూడదుప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటాలి అది మన బాధ్యతగా చేయాలి

### రాము సైకిల్ యాత్ర చేపట్టడం హర్షించదగా విషయం : ప్రముఖ న్యాయవాది సేవూరివిజయ మోహన్

**కర్నూలు ప్రతినిధి, జూన్ 13(రిపబ్లిక్ న్యూస్)**

ప్రకృతిలో అత్యంత ప్రధానమైన వాటిని సంరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతూ విశాఖపట్నం చెందిన రాము సైకిల్ యాత్ర చేపట్టడం హర్షించదగ్గ విషయం అని సేపూరి సర్వీసెస్ & లా అసోసియేషన్స్ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది విజయ మోహన్ తెలిపారు.

రాము సైకిల్ యాత్ర కర్నూలుకు చేరుకున్న విషయాన్ని తెలుసుకుని తమ కార్యాలయంలో గోవింద రాజుతో కలిసి ఆయన ఘనంగా సత్కరించి సన్మానించారు. రాము మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 3 సంవత్సరాల 7 నెలలుగా సైకిల్ యాత్ర కొనసాగిస్తూ..ఎవరు కూడా అనవసరంగా ఏళ్ల నాటి చెట్లను నరక వద్దని, ప్రతిఒక్కరూ తమ ప్రత్యేక దినాలను పురస్కరించుకొని మొక్కలు నాటి వాటిని సంరక్షించి భవిష్యత్ తరా లకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ప్రస్తుతం ఎక్కడ చూసినా ఎండ వేడిమి అధికంగా ఉందని, తద్వారా నీటి ఎద్దడి రాష్ట్రవ్యాప్తంగా తాండవిస్తోందని, అలాంటి సమస్య నుండి బయట పడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా నీటిని వృధా చేయకుండా చూడాలన్నారు.




2024లో ప్రపంచంలోనే అతిపెద్ద లద్దక్ వెళ్లి అక్కడ కూడా జాతీయ జెండాను ఎగురవేయడం జరిగిందన్నారు. 33 రాష్ట్రాలు.. 52,000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం మన రెండు తెలుగు రాష్ట్రాల్లో యాత్ర కొనసాగుతుంద ని, త్వరలోనే తెలంగాణ రాష్ట్రం లోకి తన యాత్ర ప్రవేశిస్తుందని , దీంతో తన దేశ సైకిల్ యాత్ర దిగ్విజయంగా పూర్తి అవుతుందని రాము స్పష్టం చేశారు. అలాగే గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించినప్పుడే దేశవ్యాప్తంగా గోసంరక్షణ సాధ్య పడుతుందని చెప్పారు, ఎన్నో వందల ఏళ్ల నుంచి గోమాతని పూజిస్తూఉన్నాము అని రాజు తెలిపారు

# సర్వజన ఆసుపత్రిలో అధ్వాన్న పరిస్థితులు

### పనిచేయని ఎక్స్‌రే.. రోగుల అవస్థలు -ప్రజా ఆరోగ్యంపై అధికార యంత్రాంగం నిర్లక్ష్యం





**అనంతపురం వైద్యం, జూన్ 13,(రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం నెలకొన్నట్లు రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే, సీఆర్ (కంప్యూటెడ్ రేడియోగ్రఫీ) వ్యవస్థలు పనిచేయకపోవడంతో నిత్యం వైద్య పరీక్షల కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రమాదాలు, ఎముకల సంబంధిత వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎక్స్‌రే పరీక్షలు అత్యవసరం. అయితే పరికరాలు పనిచేయక పోవడంతో గంటల తరబడి వేచి చూసినప్పటికీ పరీక్షలు జరగక నిరాశతో వెనుతిరిగి పోతున్న పరిస్థితులు నెలకున్నాయి. అందులో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో కొందరు రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు.ఆసుపత్రిలో సాంకేతిక లోపాలు తలెత్తుతున్నప్పటికీ వాటి మరమ్మతులపై అధికారులు సరిగా స్పందించకపోవడం గమనార్హం. దీంతో కనీస నిర్వహణ, పర్యవేక్షణ లోపించడం వల్ల రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.జిల్లాలో అతిపెద్ద ప్రభుత్వ వైద్యశాలగా పేరొందిన సర్వజన ఆసుపత్రిలోనే ఈ పరిస్థితులు నెలకొనడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు పనిచేయకపోవడం ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోంది. అందులో భాగంగా ఎక్స్‌రే, సీఆర్ వ్యవస్థలను తక్షణమే మరమ్మతు చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ఆసుపత్రిలోని మౌలిక వసతుల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

## రైల్వే సౌత్ కోస్ట్ జిఎం సందీప్ మత్తూర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి.

**రైల్వే కోడూరు జూన్ 13 రిపబ్లిక్ న్యూస్.**


కడప జిల్లా రాజంపేట రైల్వే స్టేషన్ కు శనివారం నాడు రైల్వే సౌత్ కోస్ట్ జనరల్ మేనేజర్ సందీప్ మత్తూర్ విచ్చేసి అమృత్ భారత్ స్కీమ్ పరిధిలో జరుగుతున్న పనులను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుంతకల్ రైల్వే డిఆర్ యుసిసి సభ్యులు, వైసిపి రాయలసీమ జోన్ బూత్ కమిటీ కన్వీనర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి సందీప్ మత్తూర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం తల్లెం భరత్ కుమార్ రెడ్డి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగినది అనంతరం సమస్యలపై వినతి పత్రం ఆయనకు అదివ్వడం జరిగినది,అనంతరం భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఉన్నటువంటి రైల్వే స్టేషన్లో కొన్నిచోట్ల బ్రిడ్జిలను సరిగ్గా నిర్మించకపోవడం మరియు వాటి యొక్క నిర్మాణ పురోగతి పనుల గురించి పూర్తి వివరాలతో తెలియజేయడం జరిగింది. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట రైల్వే కోడూరు ఎర్రగుంట్ల మధ్య బెంగళూరు కు పోవడానికి మరియు కోడూరు రాజంపేట కడప ఎర్రగుంట్ల మరియు తాడిపత్రి అనంతపురం గుత్తి గుంతకల్ ధర్మవరం మీదుగా బెంగళూరుకు పోవుటకు రైలు రాకపోకలను ఏర్పాటు చేయాలని, పుల్లంపేట శెట్టిగుంట రైల్వే స్టేషన్ కు నంద్యాల – రేణిగుంట డెమో ట్రైన్ స్టాపింగ్ ఇవ్వవలసిందిగా తెలియజేస్తూ, నందలూరు అండర్ బ్రిడ్జి నెంబర్ 111 సరైనటువంటి నిర్మాణం జరగలేదని ,భవిష్యత్తు కార్యక్రమం లో భాగంగా రద్దీని దృష్టిలో పెట్టుకొని నేషనల్ హైవే 716 కు అనుసంధానంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి తద్వారా ప్రఖ్యాత సౌమ్యనాథ స్వామి గుడికి వెళ్లడానికి వీలుగా ఉంటుందని , అంతేకాకుండా ట్రాఫిక్ నియంత్రణకు అడ్డుకట్ట వేయచ్చని తెలిపారు. ముఖ్యంగా వందే భారత్ రైలు రేణిగుంట వరకు మాత్రమే పరిమితమైన తరుణంలో రేణిగుంట రైల్వే కోడూరు రాజంపేట కడప మీదుగా హైదరాబాద్ వరకు మరియు విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లకు ఇదే మార్గంలో వందే భారత్ రైళ్లను పొడిగించే విధంగా చర్యలు చేపట్టాలని, నందలూరు రైల్వే స్టేషన్ కి వాటరింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని, గూడూరు విజయవాడ ప్యాసింజర్ రైలును రేణిగుంట మీద కడప వరకు పొడిగించవలసిందిగా కోరారు. నిర్మించినటువంటి రైల్వే అండర్ బ్రిడ్జిలకు సన్ రూఫ్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు వాహనదారులకు రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చేయాలని తెలిపారు. అన్నమయ్య జిల్లా పీలేరు రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న 759 బ్రిడ్జిలో ఎంపీ నిధులతో బ్రిడ్జి రోడ్డు వేసుకునే దానికి అనుమతులు మంజూరు చేయాలని తెలియజేస్తూ కోలాపూర్ ట్రైన్ స్టాపింగ్ పలు రైల్వే స్టేషన్లో లేదని వాటిని కూడా పునరుద్ధరించాలని తెలుపుతూ రేణిగుంట నంద్యాలకు ఉదయం సమయంలో ఒక డెమో ట్రైన్ ను ప్రయాణికుల ప్రయాణ సౌకర్యార్థం ఏర్పాటు చేసి ప్రజలకు రైలు ద్వారా రాకపోకలను చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన వినతిపత్ర రూపంలో తెలియపరచడం జరిగింది. ఇవన్నీ ఎంతో ఓపిగ్గా, సహృదయంతో విన్న జిఎం సందీప్ మత్తూర్ వీటన్నిటిపై దృష్టి సారిస్తామని ఒక ప్రణాళిక తయారు చేసి వీలైనంత మేరకు అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు భరత్ కుమార్ రెడ్డి తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.



## కట్టను తవ్వారు రోడ్డును వేశారు- అధికారులు చర్యలు ఎక్కడ.

**రైల్వే కోడూరు జూన్ 13 రిపబ్లిక్ న్యూస్.**

మండల పరిధిలోని పెద్ద ఓరంపాడు పంచాయతీలో ఉన్న రెడ్డికుంట చెరువు కట్టను తవ్వి పంట పొలాలకు వెళ్లేందుకు అక్రమ రోడ్డునిర్మాణం ఏర్పాటు చేస్తున్న ఘటన స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రజలకు ఉపయోగపడే చెరువు కట్టను ధ్వంసం చేసిఅక్రమరోడ్డు వేయడం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మంచిది కాదని స్థానికులు అభిప్రాయం చేశారు కొందరు అక్రమార్కులు , తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



రాజంపేట నుంచి కోడూరు వైపు వెళ్లే పెద్ద ఓరంపాడు బస్సు ఈ చెరువు కట్టపైనే ప్రయాణిస్తుండటంతో, కట్ట బలహీనపడితే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు నిల్వ ఉండే సమయంలో కట్టకు ఏదైనా నష్టం జరిగితే నీటి పారుదల వ్యవస్థ దెబ్బతినడంతో పాటు భారీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

గ్రామ ప్రజల కథనం ప్రకారం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొందరు రాజకీయ అండదండలతో చెరువులు, కుంటలు, వాగులు, చెరువు కట్టలపై ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి వ్యక్తిగత అవసరాల కోసం చెరువు కట్టను తవ్వి రోడ్డు వేయడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

ఈ వ్యవహారంపై ఇరిగేషన్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, చెరువు కట్టను యథావిధిగా పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

ప్రజా ఆస్తులను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, చెరువు కట్టల ఆక్రమణలు మరియు ధ్వంసంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యుత్ షాక్ తో మరణించిన జేరిపోతుల అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోటా కళాశాల ముందు బీఎస్పీ ఆధ్వర్యం లో ఆందోళన






**కరీంనగర్ ప్రతినిధి జూన్ 13 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
విద్యుత్ షాక్ తో మృతి చెందిన జేరిపోతుల అజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పద్మనగర్ లోని కోటా ప్రయివేట్ విద్యాసంస్థల ముందు ధర్నా నిర్వహించారు కుటుంబ సభ్యుల తో కలిసి ధర్నా చేపట్టారు అక్కడికి టూ టౌన్ సిఐ సృజన్ రెడ్డి వచ్చి ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులతో మాట్లాడి బంధువులతో మాట్లాడి ధర్నా ను విరమింపచేశారు. అంతకు ముందు బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం మీడియా తో మాట్లాడుతూ కోటా విద్యా సంస్థల యజమాని లాయిడ్ కంపెనీ యాజమాన్యం లు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా పని చేయించడం వలన వారి సమన్వయ లోపం వలన విద్యుత్ షాక్ తగిలి అజయ్ మరణించినాడని అన్నారు. కళాశాల భవనం కి అనుమతులు ఉన్నాయో లేవో అని ఉంటే రాత్రి కి రాత్రే కళాశాల బోర్డ్ లు ఎందుకు తీసివేసారని రామచంద్రం అన్నారు . జిల్లా లోని కార్మిక శాఖ అధికారులు, సివిల్ ఇంజనీరింగ్ భవన నిర్మాణ అధికారులు విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తు లో ఉండి నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న వారిపై పర్యవేక్షణ చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టరు స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నుండి మృతుడి కుటుంబానికి ఒక కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మృతుడి తండ్రి పిర్యాదు మేరకు లాయిడ్ కంపెనీ వారి మీద కోటా విద్య సంస్థల యాజమాన్యం పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆందోళన లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ , జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ , పార్లమెంట్ ఇంచార్జ్ బోయిని బాబు సిరిసిల్లా అంజయ్య మృతుడి కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు

## అందోల్-జోగిపేటలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

### కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జిషాన్ ఆధ్వర్యంలో

**ఆందోల్ ప్రతినిధి జూన్ 13( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
సంగారెడ్డి జిల్లాలోని అసిల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, అందోల్–జోగిపేట మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ జీషాన్ నాయకత్వంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది.
ఈ వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 165 మంది ప్రజలు ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలు మరియు వైద్య సేవలను పొందారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ శ్రీ కృష్ణారెడ్డి గారు హాజరయ్యారు. అలాగే 16వ వార్డు కౌన్సిలర్ శ్రీ శ్రీను గారు, 18వ వార్డు కౌన్సిలర్ శ్రీ అనిల్ గారు, కో–ఆప్షన్ సభ్యుడు శ్రీ ప్రవీణ్ గారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తమ సహకారాన్ని అందించారు.
ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో




అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజల సంక్షేమం కోసం మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు, వైద్య బృందం,




నిర్వాహకులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంది.

## హుసేనాపురం గ్రామంలో జలదుర్గం పోలీసుల పల్లె నిద్ర

### గ్రామస్తులతో మమేకమైన ఎస్.ఐ, సిబ్బంది -సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన

**నంద్యాల క్రైం, జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్ నేరాలు మహిళలపై జరిగే అఘాయిత్యాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు జలదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని హుసేనాపురం గ్రామంలో పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. జలదుర్గం సబ్–ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామంలో రాత్రి బస చేసి, గ్రామస్తులతో నేరుగా మమేకమయ్యారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి నుండి స్థానిక భద్రతకు సంబంధించిన పలు కీలక సమాచారాలను సేకరించారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన సదస్సులో ఎస్.ఐ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో సాంకేతికతతో పాటు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల మరియు రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ సిబిఐ, ఇడి లేదా పోలీస్




అధికారులమంటూ భయపెట్టి ఫోన్ కాల్స్ ద్వారా చేసే 'డిజిటల్ అరెస్ట్' మోసాలకు ఎవరూ లొంగకూడదని, చట్టంలో అలాంటి అరెస్టులు లేవని స్పష్టం చేశారు. తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీలు చెప్పకూడదని.. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేసి యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురై డబ్బులు పోగొట్టుకుంటే, వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసిగాని ప్రభుత్వ సైబర్ క్రైమ్ అనే వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలని, తద్వారా పోగొట్టుకున్న సొమ్మును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇది మీ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా ముప్పని హెచ్చరించారు. మైనర్లకు (పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలకు) వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్.ఐ. కోరారు. ఈ కార్యక్రమంలో హుసేనాపురం గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైలం అమ్మవారికి భారీ విరాళం

### కోటి విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు అప్పగింత

**నంద్యాల,జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లకు భక్తులు భారీ విరాళాన్ని అందజేశారు. కోటి రూపాయలు విలువచేసే బంగారు, వెండి వస్తువులను మల్లన్న



స్వామికి దాతలు సమర్పించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన శ్రీ లలితా ఎంటర్ ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ దంపతులు వెండి వస్తువులు, బంగారు అభరణాలను స్వామిఅమ్మవార్లకు సమర్పించినట్లు ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. బంగారు నామాలు, చంద్రవంక కలిగిన వెండి జటాజూటం, పలు వెండి పూజావస్తువులు, బంగారు రుద్రాక్షమాల, మంగళసూత్రాలను సమర్పించారని ఈఓ తెలిపారు. వెండి వస్తువుల బరువు 42 కేజీల 516 గ్రాములు ఉండగా, బంగారు అభరణాల బరువు 73 గ్రాముల 500 మిల్లీ గ్రాములుగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీటి విలువ సుమారు కోటి రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఆలా అనిల్ కుమార్ ఆధ్వర్యంలో దేవస్థానానికి దాతలు అందజేశారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

### దర్శనానికి 24గంటల సమయం



**తిరుమల,జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):** వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం సర్వదర్శన భక్తులను బాట గంగమ్మ ఆలయం నుంచి సర్వదర్శన క్యూలైన్‌లోకి అనుమతిస్తున్నారు. కూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పాలు వంటివి శ్రీవారి సేవకుల ద్వారా అధికారులు అందజేస్తున్నారు. సీఆర్‌వో వద్ద వసతి గదుల కోసం, కళ్యాణకట్ట కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు.

## పటాన్‌చెరులో భారీ సైబర్ మోసం


### విశ్రాంత ఉద్యోగిని భయపెట్టి రూ.58.94 లక్షల లూటీ

**సంగారెడ్డి,జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
పటాన్‌చెరు శ్రీనగర్ కాలనీకి చెందిన విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి మోహన్ రెడ్డి.. సైబర్ నేరగాళ్ల చేతిలో భారీ మోసానికి గురయ్యారు. మనీలాండరింగ్ కేసు పేరుతో భయపెట్టి ఆయన నుంచి మొత్తం రూ.58.94 లక్షలను దశలవారీగా వసూలు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి.. ప్రవీణ్ కుమార్, రాజేష్ మిశ్రా అనే ఇద్దరు వ్యక్తులు ఫోన్ చేశారు. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్‌కు సంబంధించిన రూ.538 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆధార్ వివరాలు దుర్వినియోగమయ్యాయని ఆరోపిస్తూ మోహన్ రెడ్డిని బెదిరించారు. ఈ కేసులో మీ పేరుతో కూడా లావాదేవీలు జరిగాయని, దాదాపు రూ.2 కోట్ల ట్రాన్సాక్షన్లు, వాటిపై కమిషన్ తీసుకున్నారని చెప్పి ఆయనను భయభ్రాంతులకు గురిచేశారు. 'మీపై కేసు నమోదైంది, అరెస్ట్ చేయాల్సి ఉంటుంది' అంటూ ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన మోహన్ రెడ్డి, దశలవారీగా పలు బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.58.94 లక్షలు బదిలీ చేశారు. అనంతరం ఇది మోసమని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సైబర్ నేరగాళ్లు తరచుగా అధికారులుగా నటిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇలాంటి కాల్స్‌కు స్పందించవద్దని పోలీసులు సూచించారు.

## తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసు

### కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క మృతి

**కాకినాడ,జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
తుని చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో కీలకంగా భావిస్తున్న పెంపుడు కుక్క అనుమానాస్పదంగా మృతిచెందింది. ఈ ఘటనతో కేసు దర్యాప్తులో కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 6వ తేదీన చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమైన సమయంలో ఆమె వెంట వెళ్లిన పెంపుడు కుక్క కూడా కొంతకాలం కనిపించకుండా పోయింది. మూడు



రోజుల తర్వాత కుక్క తిరిగి ఇంటికి వచ్చింది. ఆ తర్వాత నుంచి అది విచిత్రంగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు దాన్ని పర్యవేక్షణలో ఉంచారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చారు. దాని కదలికలను నిన్న ప్రత్యేకంగా పరిశీలించారు. చిన్నారి అదృశ్యం కేసులో ఆ కుక్క కీలక ఆధారాలు ఇవ్వవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో డాగ్ ప్రవర్తనపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అయితే, గత రెండు రోజులుగా కుక్క ఆరోగ్యం క్షీణించడంతో వెటర్నరీ వైద్యులు చికిత్స అందించారు. గతరాత్రి కుక్కకు ఇంజెక్షన్ ఇచ్చిన తర్వాత, ఈరోజు ఉదయం అనారోగ్యంతో మృతిచెందింది. ఈ అనూహ్య ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారి అదృశ్యం కేసులో పెంపుడు కుక్క మృతి కారణంగా కీలక ఆధారం కోల్పోయినట్లయింది. ఇప్పటివరకు ఆ కుక్క కదలికల ద్వారా కొంత సమాచారం లభించవచ్చని పోలీసులు ఆశించారు. చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. చిన్నారిని ఎవరైనా అపహరించారా అనే కోణంలో కూడా విచారణ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో తుని, కాకినాడ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది.

## హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

**జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్‌లో అక్రమ వలసదారులపై పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. జీడిమెట్ల ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ పౌరులను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు గాజులరామారం హెచ్ఏఎల్





కాలనీలోని ఓ అద్దె ఇంటిపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్కడ నివసిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వీరు ఉంటున్నట్లు గుర్తించారు.
తదుపరి న్యాయపరమైన చర్యల కోసం వారిని మెదక్ జిల్లా జోగిపేటలో ఉన్న డిపోర్టేషన్ కేంద్రానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. వారి భారత్ ప్రవేశం, నివాసం, ఇతర వివరాలపై లోతైన దర్యాప్తు కొనసాగుతోంది. బెంగాల్ లోని సువేందు అధికారి ప్రభుత్వం అమలు చేస్తున్న 'గుర్తింపుతొలగింపుదేశ బహిష్కరణ' (Identify`Remove`Deport) విధానంలో భాగంగా అక్రమ వలసదారులపై చర్యలు మరింత కఠినతరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో కూడా అదే తరహా తనిఖీలు జరగడం గమనార్హం.

# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ ?

**జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు



ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# విజయ్ కుటుంబంలో అనూహ్య పరిణామం

**భార్య సంగీతను మళ్లీ కుటుంబంలోకి తీసుకు వచ్చే యత్నం -రంగంలోకి దిగిన విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్**

**చెన్నై, జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**

తమిళనాడు సీఎం విజయ్ జోసెఫ్ సంసారం చక్కదిద్దే పనిలో ఆయన తల్లి శోభ రంగంలోకి దిగినట్లు సమాచారం. సిఎం కావడంతో విజయ్ ప్రస్తుతం ప్రజాసేవలో మునిగిపోయారు. పదవి చేపట్టిన దగ్గరనుంచి ఆయన ప్రజలకు మంచి చేయాలని చూస్తున్న వేళ క్షణం తీరికి లేకుండా ఉన్నారు. ఇంకోపక్క ఇండస్ట్రీక్రి కూడా దగ్గరగానే ఉంటున్నారు. ఇక ఇదంతా పక్కన పెడితే.. విజయ్ వ్యక్తిగత విషయం ఒకటి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొంతకాలంగా విజయ్, ఆయన భార్య సంగీత విడివిడిగా ఉంటున్న విషయం తెల్సిందే. ఎన్నికల సమయంలో విజయ్ భార్య సంగీత.. తన భర్త నటి త్రిషతో రిలేషన్ లో ఉన్నారని, తనను, తన పిల్లలను ఆయన మోసం చేశారని, తనకు విడాకులు ఇప్పించాలాని కోర్టులో కేసు వేశారు. విజయ్ సీఎం అయ్యినపుడు కానీ, ప్రమాణ స్వీకారం అప్పుడు కానీ.. సంగీత, పిల్లలు ఆయన పక్కన లేరు. దీంతో వీరిమధ్య దూరం బాగా పెరిగిందని, సంగీత ఇక



లండన్ నుంచి రాదనుకున్నారు. త్వరలోనే విజయ్.. త్రిషను పెళ్ళి చేసుకుంటున్నట్లు కూడా వార్తలు వినిపించాయి. ఇక తాజాగా ఇండస్ట్రీ మొత్తానికి షాక్ ఇచ్చినట్లు విజయ్ - సంగీత కలిసిపోయారని సమాచారం. వీరిద్దరి మధ్య ఉన్న మనస్పర్థలను పరిష్కరించి, ఈ జంటను తిరిగి ఒకటి చేయడానికి కుటుంబ సభ్యులు తెరవెనుక గట్టి ప్రయత్నాలే చేసినట్లు తెలుస్తోంది. కొడుకు- కోడలిని కలపడానికి విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ అత్యంత కీలక పాత్ర పోషించారని తెలుస్తోంది. కొడుకు రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, అలాగే కుటుంబ బంధాలను కాపాడుకోవడానికి శోభ స్వయంగా కోడలు సంగీతతో మాట్లాడి, ఇరుపక్షాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కారం అయ్యేలా చేసినట్లు సమాచారం. తల్లి చేసిన ఈ గట్టి ప్రయత్నాల వల్లనే విజయ్ - సంగీత మళ్లీ కలిసి ఒకే ఇంట్లో ఉండటానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెన్నై వర్గాల సమాచారం. విజయ్ త్వరలోనే పూర్తిస్థాయి రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో.. భార్య సంగీత మళ్లీ ఆయన పక్కన చేరడం పొలిటికల్‌గా కూడా విజయ్‌కు చాలా ప్లస్ అవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంకోపక్క విజయ్ కొడుకు జేసన్ సంజయ్ కి కూడా ఇప్పుడు తండ్రి సపోర్ట్ చాలా అవసరం. అందుకే సంగీత కూడా భర్తతో ఉండడానికి ఒప్పుకొన్నారని అంటున్నారు. ప్రేమ, పెళ్ళి అంటూ విజయ్ వెనుక తిరిగిన త్రిషకు ఇప్పటివరకు ఒరిగింది ఏం లేదు. అలాంటప్పుడు విజయ్ - సంగీత కలిసిపోతే త్రిష సైలెంట్ గా ఉంటుందా.. అన్న చర్చ కూడా సాగుతోంది.

# చంద్రబాబు, లోకేష్ వీడియోలతో దోచేసిన సైబర్ నేరగాళ్లు


**ఏఐతో దోపిడీలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు**

**డీప్‌ఫేక్ వీడియోల ద్వారా రూ. 80 వేలు దోచేసిన వైనం**

**సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వైజాగ్ వ్యక్తి**

**జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఎంతలా అభివృద్ధి చెందుతోందో తెలిసిందే. దానిని అడ్డం పెట్టుకుని సైబర్ నేరగాళ్లు ప్రమాదకరమైన మోసాలకు తెరలేపుతున్నారు. ఏకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల 'డీప్‌ఫేక్' వీడియో కాల్స్‌ను సృష్టించి విశాఖపట్నానికి చెందిన ఒక సామాన్య వ్యక్తిని రూ. 80 వేలకు ముంచేసిన షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. సాంకేతికతను వాడుకుని కేటుగాళ్లు ఎంత పక్కాగా స్కెచ్ వేశారో ఈ వివరాలు చూస్తే అర్థమవుతుంది. విశాఖపట్నం సీతంపేటకు చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తికి ఒక భూమి సమస్య ఉంది. దానిని పరిష్కరించాలంటూ ఆయన మంత్రి నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. దీనిని గమనించిన సైబర్ దొంగలు మరుసటి రోజే వాట్సాప్ ద్వారా శ్రీనివాస్ రెడ్డిని



కాంటాక్ట్ చేశారు. నమ్మకం కుదర్చడం కోసం మాజీ మంత్రి దేవినేని ఉమా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్నారు. మీ సమస్య సీఎంఓ దాకా వెళ్లిందని, త్వరలోనే పరిష్కారమవుతుందని నమ్మబలికారు.
బాధితుడికి ఇంకాస్త గట్టి నమ్మకం కలిగించడం కోసం నేరగాళ్లు ఏఐ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి ఒక వీడియో కాల్ చేశారు. ఆ కాల్‌లో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కూర్చుని, తన సమస్యను పరిష్కరిస్తామని స్వయంగా హామీ ఇస్తున్నట్లు ఆ వీడియోను మార్ఫింగ్ చేశారు. ఆ వీడియో కాల్ చూసిన శ్రీనివాస్ రెడ్డి... నిజంగానే ముఖ్యమంత్రే తనతో మాట్లాడుతున్నారని నమ్మి మైమరచిపోయారు. ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టిన కేటుగాళ్లు.. ఈ ల్యాండ్ ఇష్యూ కాస్త కాంప్లికేటెడ్‌గా ఉందని, దీనిని సెటిల్ చేయాలంటే కొంత ఖర్చవుతుందని నమ్మబలికారు. బాధితుడి నుంచి విడతల వారీగా దాదాపు 80 వేల రూపాయలను ఆన్‌లైన్ ద్వారా గుంజేశారు. డబ్బులు పంపిన తర్వాత అవతలి వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో, తాను దారుణంగా మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్ రెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఈ హైటెక్ మోసంపై దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ నేరాల శైలి కూడా ఎలా మారుతోందో చెప్పడానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ. సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత సమస్యలను, ఫోన్ నంబర్లను పెట్టేటప్పుడు.. అలాగే గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# సిరిసిల్ల మనబడి-మనబాధ్యతలో బండి

**ఎస్పీ హాజరు కాకపోవడంపై మంత్రి ఆగ్రహం**

**రాజన్న సిరిసిల్ల,జూన్13:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన 'మన బడి-మన బాధ్యత' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేశ్ బి. గీతే హాజరు కాకపోవడంపై బండి సంజయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాత్రమే ఉండటంతో.. 'ఎస్పీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తాను సాధారణ కార్యకర్తను కాదని, కేంద్రమంత్రిగా పాల్గొంటున్న కార్యక్రమానికి జిల్లా పోలీసు అధికారి హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'మీ ఎస్పీకి బీఆర్ఎస్‌పై అంత ప్రేమ ఎందుకని ప్రశ్నించారు. అవసరమైతే బీఆర్ఎస్‌లో చేరాలని వ్యంగ్యంగా అన్నారు. అధికార యంత్రాంగం రాజకీయ పక్షపాతం లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ ఆదేశించారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

----------------

# సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ

**సిఎం రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

**హైదరాబాద్,జూన్13:** సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. సింగరేణిలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. సింగరేణి నుంచి దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి. భద్రతను కఠినతరం చేయాలి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి రూ.51,500 కోట్లకు పైగా బకాయి పడి ఉంది. దీంతో సంస్థపై ఆర్థిక ఒత్తిడి నెలకొంది. సంస్థలో సేఫ్‌గార్డ్స్, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ పనితీరును సమీక్షించాలి. సింగరేణి సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయాలని లేఖలో పేర్కొన్నారు. 40 వేల మందికి పైగా ఉన్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమంతోపాటు సంస్థ భవిష్యత్తును కాపాడటం మన అందరి బాధ్యత అని చెప్పారు.

# అసలు ఓట్లు తొలగించే కుట్ర: కెటిఆర్

**రాజన్న సిరిసిల్ల,జూన్13:** తెలంగాణలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' పక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని కేటీఆర్ తేల్చిచెప్పారు. రైతుభరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో దొంగ ఓట్లతో అసలైన ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

# రైతుల సంక్షేమం లక్ష్యంగా కృషి

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**నల్గొండ,జూన్13:** రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని... గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. శనివారం నల్గొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్ - 2026ను రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. నల్గొండ జిల్లా పేరు చెప్పగానే బత్తాయి తోటలు గుర్తుకు వస్తాయని మంత్రి కోమటిరెడ్డి ప్రస్తావించారు. గత నాలుగు దశాబ్దాలుగా వేలాదిమంది రైతుల జీవనాధారంగా బత్తాయి సాగు చేస్తున్నారని తెలిపారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని చెప్పుకొచ్చారు. గతంలో స్వయంగా బత్తాయి సాగు చేసిన అనుభవం తనకు ఉందని వివరించారు. గత సంవత్సరం వరకు బత్తాయి రైతులకు ప్రత్యేకంగా ఓ వేదిక లేకపోవడం లోటుగా ఉండేదని అన్నారు. పుస్తకాల్లో ఉండే శాస్త్రీయ జ్ఞానం రైతుల పొలాల వరకు చేరినప్పుడే వ్యవసాయ రంగంలో నిజమైన మార్పు వస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

**పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు**

**మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్య**

**కర్నూలు,జూన్13:** ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ




మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) మంత్రి భరత్ కర్నూల్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 19 కంపెనీల్లో 1460 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తామని మంత్రి భరత్ వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు సృష్టించేందుకు కష్టపడుతున్నామని చెప్పుకొచ్చారు. ఓర్వకల్లుకు గతంలో ఎప్పుడు లేనంతగా కంపెనీలను తీసుకువస్తున్నామని తెలిపారు. రిలయన్స్, అగస్త్య కంపెనీలను కర్నూలుకు తీసుకువచ్చామని ప్రస్తావించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడిని పెడుతోందని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ప్రపంచంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే దేశంలోకి వచ్చే 25 శాతం పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయని మంత్రి భరత్ పేర్కొన్నారు.

# తంగడంచా గ్రామంలో భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

## మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం





**నంద్యాల క్రైం, జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాను మాదకద్రవ్యాల నియంత్రణ జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాల మేరకు ఆత్మకూరు డిఎస్పి రామాంజనేయ పర్యవేక్షణలో మాదక ద్రవ్యాల బెడదను సమాజం నుండి పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులు నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జూపాడుబంగ్లా మండలం, తంగడంచ గ్రామంలో సబ్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, పోలీసు సిబ్బందితో కలిసి విస్తృతమైన కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను అక్రమంగా కలిగి ఉండటం, అమ్మడం లేదా వినియోగించడం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలోని పలు అనుమానిత గృహాలు, వాణిజ్య సంస్థలలో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల అనంతరం, గ్రామంలోని యువతను లక్ష్యంగా చేసుకుని ఒక ప్రత్యేక సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ"మాదక ద్రవ్యాల దుర్వినియోగం వల్ల తీవ్రమైన శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుని చట్టపరమైన ఇబ్బందుల్లో పడతారు."ఈ పోరాటంలో దీర్ఘకాలిక నిబద్ధతను పెంపొందించేందుకు గ్రామస్థులందరితో కలిసి సామూహిక మాదక ద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. హానికరమైన మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, చట్టాన్ని అమలు చేసే పోలీస్ అధికారులకు ఎల్లప్పుడూ సహకరిస్తామని, ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి కలిసికట్టుగా కృషి చేస్తామని గ్రామస్థులు గంభీరంగా తీర్మానించారు. ప్రస్తుతం తంగడంచ గ్రామం పూర్తిగా ప్రశాంతంగా ఉందని, నిరంతరం పోలీసుల నిశిత పర్యవేక్షణలో ఉంటుందని ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు నివేదించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.


# ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఆదేశించిన.. చర్యలు శూన్యం !

**భూ సమస్య పరిష్కారం కోసం ఎస్సీ కమిషన్ ఛైర్మన్ నీ ఆశ్రయించిన వృద్ధురాలు**

**మీ ఫిర్యాదు ఆన్లైన్ నమోదు కాలేదంటున్న అధికార యంత్రాంగం**

**దిక్కుతోచని స్థితిలో బాధిత వృద్ధురాలు**






**నంద్యాల ప్రతినిధి జూన్ 13, (రిపబ్లిక్ న్యూస్):-** స్వయానా రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఆదేశించిన ఇక్కడి అధికార యంత్రాంగం వాటి పరిష్కారం కోసం కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మీరు ఇచ్చిన వినతి పత్రం ఆన్లైన్ లో కాలేదని నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులు వినతి పత్రం పరిశీలించకుండా చేతులెత్తేశారు. దీంతో బాధిత వృద్ధురాలు దిక్కుతోచని స్థితిలో ఉంది. వీటికి సంబంధించిన బాధితురాలి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ ఈనెల 12న నంద్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకమైనటువంటి ఫిర్యాదులను ఆయన నేరుగా స్వీకరించి సంబంధిత అధికారులకు వీటిని పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన బాయికాటి బాల సుబ్బమ్మ అనే వృద్ధురాలు ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న భూ సమస్య పరిష్కారం కోసం స్వయాన ఎస్సీ కమిషన్ ఛైర్మన్కు వినతి పత్రం సమర్పించింది. అది పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులను ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అయితే ఆసమయంలోఅక్కడ నమోదు చేసుకున్న అధికారులు ఆతర్వాత ఆన్లైన్లో ఫిర్యాదు నమోదు కాలేదని కనీసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితురాలు బాలసుబ్బమ్మ తెలిపింది. తాము వినతి పత్రం సమర్పించి సుమారు పది రోజులు గడిచిన ఈ విషయానికి సంబంధించి అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదన్నారు. దీంతో వివరాలు తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి వివరాలు అడగడంతో మీరు సమర్పించిన వినతి పత్రం ఆన్లైన్లో నమోదు కాలేదని సమాధానమిచ్చారన్నారు. తాము నేరుగా స్వయానా ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కు వినతి పత్రం సమర్పించి తమ సమస్యను విన్నవించుకున్నప్పటికీ కనీసం విచారణకు రాకపోవడం విడ్డూరంగా ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాము సమర్పించిన వినతి పత్రం తీసుకున్న అధికారులు ఏలాంటి సంతకం కానీ..సీల్ కానీ వేయకుండా రసీదు ఇచ్చారనీ బాధితురాలు తెలిపింది. ఈ విధంగా ఛైర్మన్ ఆదేశించిన కనీసం చర్యలు చేపట్టకపోవడం ఇక్కడి అధికార యంత్రాంగాన్ని నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆమె మండిపడింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తాము సమర్పించిన వినతి పత్రమును పరిశీలించి తగు న్యాయం చేయవలసిందిగా ఆమె కోరారు. ఈ క్రమంలో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఆదేశించిన ఇక్కడి అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహించడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తూ ఎందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# గొలుసుకట్టు చెరువుల అభివృద్ధితో భూగర్భ జలాల పెంపే లక్ష్యం

**జలధార - జలహారతి పనుల్లో నంద్యాల జిల్లా రాష్ట్రానికి ఆదర్శం**

**కొలిమిగుండ్ల చెరువుల అనుసంధాన విజయగాథను ముఖ్యమంత్రికి వివరించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూన్ 13 (రిపబ్లిక్ న్యూస్):** జలధారజలహారతి కార్యక్రమం కింద గొలుసుకట్టు చెరువుల అనుసంధానం, బేసిన్‌సబ్ బేసిన్ స్థాయిలో నీటి వనరుల సమర్థ నిర్వహణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా నంద్యాల జిల్లాలో వినూత్న చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. శనివారం అమరావతి నుంచి స్పెషల్ చీఫ్ సెక్రటరీ శిశుభూషణ్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. సమావేశం మధ్యలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనగా, జలధార–జలహారతి కార్యక్రమం కింద జిల్లాల్లో జరుగుతున్న పనుల పురోగతిని స్పెషల్ చీఫ్ సెక్రటరీ ముఖ్యమంత్రికి వివరించారు. నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్ల క్యాస్కేడ్ పరిధిలో ఎలాంటి అదనపు వ్యయం లేకుండా కేవలం ఎనిమిది రోజుల్లో 18 కిలోమీటర్ల మేర ఐదు గొలుసుకట్టు చెరువులను విజయవంతంగా అనుసంధానం చేసిన విధానాన్ని రాష్ట్రానికి ఆదర్శప్రాయమైన విజయగాథగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ వినూత్న కార్యక్రమం అమలు విధానం, సాధించిన ఫలితాలను స్వయంగా వివరించాలని జిల్లా కలెక్టర్ ను సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, జిల్లాలో బేసిన్, సబ్‌బేసిన్, మైక్రో బేసిన్ స్థాయిల్లో నీటి వనరుల సమగ్ర నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని సీఎంకు నివేదించారు. సర్ప్లస్ బేసిన్ల నుంచి డెఫిసిట్ బేసిన్లకు నీటి సమతుల్యత సాధించే చర్యలతో పాటు గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, చెరువుల సుందరీకరణ, వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు సీఎం కు వివరించారు. భూగర్భ జలాల పెంపును ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ బావులను పీజోమీటర్లుగా వినియోగిస్తూ నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అలాగే డ్వామా సాంకేతిక సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించి, భూగర్భ జలాల మట్టాలను శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచే విధానాలను అమలు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ చర్యల ద్వారా నీటి వనరుల సుస్థిర వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాల పెంపు దిశగా జిల్లాలో చేపడుతున్న చర్యల ఫలితంగా మే నెలలో 7.54 మీటర్లుగా నమోదైన నీటి మట్టం, గత నవంబర్ నాటికి 3.51 మీటర్లకు చేరిందని కలెక్టర్ వెల్లడించారు. రానున్న నవంబర్ నాటికి దీనిని 2.51 మీటర్లకు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ప్రతి సీజన్‌కు కనీసం ఒక మీటరు మేర భూగర్భ జలమట్టాన్ని మెరుగుపరచాలనే సంకల్పంతో అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. జలధార – జలహారతి కార్యక్రమం కింద నంద్యాల జిల్లాలో మొత్తం 2,103 పనులు మంజూరు కాగా, వాటిలో 894 పనులు పూర్తయ్యాయి, 1,209 పనులు గ్రౌండింగ్ దశలో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. పనుల వేగవంతమైన అమలు ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఇరిగేషన్ శాఖకు చెందిన సూపరింటెండింగ్ ఇంజనీర్లతో చెరువుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) పనుల పురోగతిని పరిశీలించారు. సమీక్ష సమావేశంలో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జోక్యం చేసుకొని, ఇప్పటికే పరిపాలనా అనుమతులు పొందిన పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ఫలితాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# యోగాంధ్రలో ప్రజల భాగస్వామ్యం పెంచాలి

**జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్**

**యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక.. జూన్ 21 మెగా యోగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**








**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)** యోగా భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర" కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరంలోని ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించిన పర్యాటక యోగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాభివృద్ధి కోసం యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలందరూ యోగాంధ్రలో నమోదు చేసుకుని జూన్ 21న నిర్వహించే మెగా యోగా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రోజుకు కనీసం పది నిమిషాల పాటు ప్రాణాయామం చేసినా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్ కుమార్, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా లెప్రసీ అధికారి డా. భాస్కర్ రాజు, డీఈఓ సుధాకర్, మెప్మా పీడీ శ్రీనివాసులు, డీఎస్‌డీఓ భూపతిరావు, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డా. అమర్నాథ్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ చంద్రిక, సీనియర్ వైద్యులు డా. కేవీఎన్ ప్రసాద్, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, జిల్లా యోగ సంఘం ప్రధాన కార్యదర్శి మునిస్వామి, నేషనల్ యోగ జడ్జి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**: మంత్రి టీజీ భరత్ -కర్నూలు మెగా జాబ్ మేళాలో 19 కంపెనీలు 1500 ఉద్యోగాలు**

**; ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలే కూటమి ప్రభుత్వ లక్ష్యం**









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 13)** యువత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించడంతో పాటు అనుభవాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి. జి. భరత్ పిలుపునిచ్చారు. కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గవ మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 19 ప్రముఖ సంస్థలు దాదాపు 1500 ఉద్యోగాల భర్తీ కోసం పాల్గొన్నాయని, యువత తమ ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగాలు పొందాలని సూచించారు. గతంలో నిర్వహించిన మూడు మెగా జాబ్ మేళాల్లో ఎంపికైన వారిలో కేవలం 50 శాతం మంది మాత్రమే ఉద్యోగాల్లో చేరారని పేర్కొన్న మంత్రి, వచ్చిన అవకాశాలను వదులుకోకుండా ఉద్యోగాల్లో చేరి అనుభవాన్ని సంపాదించాలని సూచించారు. ప్రస్తుతం యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పోటీ పడాల్సిన పరిస్థితి ఉందని, అందుకే ప్రతి ఒక్కరూ తమ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్‌లో రిలయన్స్, గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ రంగాలకు చెందిన భారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్‌ఎంఈల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. అధికారుల విజ్ఞప్తి మేరకు క్లస్టర్ యూనివర్సిటీ ప్రాంగణంలో మినరల్ వాటర్ ప్లాంట్, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి విడతల వారీగా సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవ రావు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు శెట్టి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనందరాజ్ కుమార్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com